క్లుప్తంగా

చట్టాల గురించి తెలుసుకోవాలి

తెనాలిరూరల్: చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ పేర్కొన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం తెనాలిలోని పెదరావూరు గ్రామంలో బాలా కార్మిక వ్యవస్థ నిషేధిత, నియంత్రణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో చేర్చడం, చేర్పించుకోవ్వడం నేరమన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

4న ఏరువాక పౌర్ణమి పూజలు

వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామంలో వినాయకస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆయన ఆయన మాట్లాడారు. మరో 10 రోజులల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని, కావున రైతాంగానికి మేలు జరిగేందుకు, అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పూజలో పాల్గొని, కార్యక్రమం జయప్రదం చేసి తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తెనాలిఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు.. తెనాలి డివిజన్ పరిధిలోని 10 సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డిప్యూటీ డీఈఓ నిర్మల తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిటౌన్: నందివెలుగులో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్‌నుల పనుల నిమిత్తం శనివారం నందివెలుగు, కంచర్లపాలెం, కొలకలూరు, చింతలపూడి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

8న వీరాంజనేయస్వామి వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి జీవధ్వజ ప్రతిష్ట ఆరో వార్షికోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఎం.కె.ఆర్ తారకం, సూర్యనారాయణ, వెంకటరమణారావులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం స్వామివారికి విశేష అర్చన, స్నపన, నాగవల్లీదళాలతో అష్టోత్తర, సహస్త్ర నామ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండపంలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం , రక్షాసూత్రధారణ, ఉత్సవమూర్తులకు స్నపన, తిరుమంజన కార్యక్రమాలను అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ నిర్వహించి హనుమద్వజంకు హోమ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, కింద కూర్చుని ఉన్న నిందితుడు

తాడికొండ: తుళ్లూరులో ఇతర రాష్ట్రాల మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. తుళ్లూరుకు చెందిన కామినేని సాంబశివరావు నుంచి రూ.48,600 విలువ చేసే మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై అనునిత్యం నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవ్యతిరేక పనులు చేస్తుంటే తమకు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు తెలిపారు. దాడిలో ఎస్ఐ మల్లికార్జున్, కోటిరెడ్డి, సిబ్బంది రమేష్, హనుమంతు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు కోకోకోలా కంపెనీ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత నెల 30వ తేదీన కోకోకోలా కంపెనీ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు, 5.6 అడుగులు ఎత్తు ఉంటాడని ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీ స్టేషన్‌లో తెలపాలని కోరారు.

జగనన్న పాలనపై అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై అన్ని వర్గాల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. అంగలకుదురు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి.. ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. మహిళలు హారతులిచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల్లోకి వెళ్లి వివరించడం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. అంగలకుదురు గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 3,800 ఇళ్లు ఉండగా మూడు వేల మందికి రైతు భరోసా వస్తోందన్నారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటిని నాలుగు నెలల్లో పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నేతలు జగన్‌మోహనరావు, తిన్నలూరి శ్రీనివాసరావు, కఠారి హరీష్, కావూరు కిషోర్, చందూరు గోపి, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

వేడుకగా శివాజీ పట్టాభిషేక శోభాయాత్ర



యాత్రలో పాల్గొన్న వివిధ సంస్థల, పార్టీల నేతలు

తెనాలి: శివాజీ మహారాజ్ ఛత్రపతిగా పట్టాభిషిక్తుడైన జేష్ఠ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి శివాజీచౌక్ వరకు శోభాయాత్ర వేడుకగా జరిగింది. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ తదితర విభాగాల ప్రతినిధులు, యువతీయువకులు, మహిళలు కాషాయ జెండాలు, తలపాగాలు ధరించి, బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. దారిపొడవునా నృత్యాలు చేశారు. కర్రసాము చేస్తూ జైరామ్ శ్రీరామ్ అంటూ నినదించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూజలు చేశారు. బహిరంగ సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సత్యకుమార్, కాకతీయ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు, జీడీసీసీ బ్యాంక్ విశ్రాంత సీఈవో డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడారు. శివాజీ స్ఫూర్తిగా యువతీ యువకులు జాతీయ స్ఫూర్తిని పొందాలని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు అవ్వారు శ్రీనివాసరావు సభా నిర్వహణ చేశారు. వివిధ పార్టీ నాయకులు, అంబటి మారుతీరామ్, మంచాల రత్నరాజు, మైలా హరికృష్ణ, సీహెచ్ పవన్ పాల్గొన్నారు.

మున్సిపల్ రెవెన్యూ అధికారి జయకర్ బదిలీ



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ రెవెన్యూ అధికారి కె.విల్సన్ జయకర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ సుమారు ఏడాది నుంచి సెలవులో ఉన్న ఆయనను.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా బదిలీ చేశారు. అలాగే భీమవరం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న డి.సోమశేఖర్ యాదవ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. వీరు రెండు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

– పంపిణీ చేసిన ఎమ్మెల్యే శివకుమార్



తోపుడు బండ్లు అందజేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి: పట్టణానికి చెందిన నటరాజ్ జ్యూయలర్ మార్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. స్థానిక చినరావూరు పార్కు వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, స్థానిక 15వ వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావుతో కలిసి మూడు తోపుడుబండ్లు, ఒక బల్ల రిక్షాను అందజేశారు. జ్యూయలరీ సంస్థ యజమాని కొత్తమాసు కుమార్ ఈ వితరణ చేపట్టారు. తండ్రి కొత్తమాసు తులసీదాస్ ఆశయాల ప్రకారం కుమారుడైన కుమార్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. చిరు వ్యాపారుల జీవనోపాధికి తోపుడుబండ్లు, బల్ల రిక్షా ఉపయోగపడుతాయని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు అన్నారు. దాత కొత్తమాసు కుమార్ మాట్లాడుతూ చినరావూరు పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడేలా పార్కు వద్ద సొంత ఖర్చులతో బస్‌షెల్టర్‌ను నిర్మిస్తానని, మూడు రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

శిక్షణకు వెళ్లిన కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు గుంటూరు జిల్లాస్థాయి శిక్షణ శిబిరానికి వెళ్లినట్లు ఆంధ్రా 22వ బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు జిల్లా గోళ్లమూడిలోని నాట్కో కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ శిబిరంలో క్యాడెట్లకు ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, డ్రిల్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అత్యవసర సహాయం అందించే విషయంలో ప్రత్యేక శిక్షణ ఉంటుందని, రిపబ్లిక్ డే పరేడ్‌పై కూడా శిక్షణ ఇస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన తెనాలి కళాకారులు



మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

తెనాలి: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, రంగస్థల కళాకారుడు బెల్లంకొండ వెంకట్ ప్రతినాయకుడిగా, మరో పదిమంది తెనాలి కళాకారులు నటించిన అభిలాష చిత్రం శుక్రవారం విడుదలైంది. స్థానిక సంగమేశ్వర థియేటరులో ప్రదర్శితమవుతున్న సినిమాను స్థానిక కళాకారులు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం నాయకులతో కలిసి మాజీ మంత్రులు నన్నపనేని రాజకుమారి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తిలకించారు. అభిలాష చిత్రం యువతకు మంచి సందేశమని, ఈ చిత్రంలో తెనాలి కళాకారులు పదిమందికి అవకాశం ఇచ్చిన చిత్రబృందానికి వారు ధన్యవాదాలు తెలియజేశారు. విలన్‌గా తనకు, ఇతర పాత్రల్లో మరికొందరికి అవకాశం కల్పించిన చిత్ర నిర్మాత శిరీష్, దర్శకుడు శివప్రసాద్‌కు బెల్లంకొండ వెంకట్ కృతజ్ఞతలు తెలియజేశారు. మా-ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా ప్రోత్సాహం మరువలేనిదన్నారు. జిల్లా కలెక్టర్ పాత్రధారి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, రైతుపాత్రలో సోమేష్ బాగా నటించారని ప్రేక్షకులు చెప్పారు. కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, కోశాధికారి బుర్రా జయలక్ష్మి, అలపర్తి వెంకటేశ్వరరావు, కనపర్తి రత్నాకర్, మధుకర్ మాట్లాడారు.

పెనుమాక శ్మశానవాటికలో చోరీ

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక హిందూ శ్మశానవాటికలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హిందూ శ్మశానవాటికలో ప్రవేశించి మృతదేహాలను దహనం చేసేందుకు ఏర్పాటుచేసిన బీడు ప్లేట్లను విప్పదీసి చోరీ చేశారు. హిందూ శ్మశానవాటికలో మృతదేహాలను దహనం చేసేందుకు రెండుచోట్ల వీటిని ఏర్పాటు చేశారు. వాటిలో ఉన్న రెండు బీడు ప్లేట్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కొక్క ప్లేటు రూ.50 వేల విలువ ఉంటుందని స్థానికులు తెలియజేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మత్తుపదార్థాల దుర్వినియోగంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక, చిగురు బాలల గ్రామంలో చైల్డ్ సేఫ్టీ బాలల పార్లమెంట్ విద్యార్థులకు మత్తుపదార్థాల దుర్వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, సరదాగా అలవాటు చేసుకుని చివరకు బానిసలుగా మారుతున్నారని వివరించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల చిన్న వయస్సు నుండే నేరప్రవృత్తికి అలవాటు పడడం, జీవితాన్ని మధ్యలోనే తెంచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్స్, ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయని, మత్తు పదార్థాలతో జీవితాన్ని దుర్భరం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా బయటకు తీసుకురావచ్చని, నవజీవన్ బాలభవన్ ఏర్పాటు చేసిన బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్, నూజివీడులోని పొలసనపల్లి గ్రామంలో ఏర్పాటు చేశామని, మానసిక సమస్యలకు విజయవాడలో నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరాలకు 9490492020ను సంప్రదించవచ్చని కోరారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.అల్ఫోన్స్‌రాజు, క్లస్టర్ కో ఆర్డినేటర్ కె.శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో రైతులు బెంబేలు

ఇప్పటంలో రూ.2 లక్షల విలువ చేసే విద్యుత్ మోటర్ల చోరీ



ఇప్పటంలో చోరీకి గురైన మోటర్లు ఉంచే సిమెంట్ దిమ్మె

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా విద్యుత్ మోటర్లు చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా శుక్రవారం తెల్లవారుజామున ఇప్పటంలో పంట పొలాల్లో శ్మశానం వెనుక 5 విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. దీంతో పాటు హిందూ శ్మశానవాటిక పక్కన ఇప్పటం ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటారు సైతం చోరీకి గురైంది. ఇప్పటంలో దొంగిలించిన విద్యుత్ మోటర్ల విలువ రూ.40 వేల ఉంటుందని, ఐదు మోటర్ల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా 15 రోజుల వ్యవధిలో తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లోను, కుంచనపల్లి, ప్రాతూరు, పెనుమాక, ఉండవల్లి ప్రాంతాల్లో సుమారు 20 మోటర్ల వరకు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటనపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జీ 20, నూతన విద్యావిధానంపై అవగాహన



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి ఎంపీయూపీ పాఠశాలలో జీ 20, నూతన విద్యావిధానంపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి.కరీముల్లా మాట్లాడుతూ జీ 20, నూతన విద్యావిధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని అన్నారు. 6,7 తరగతుల విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, టెస్ట్‌బుక్ రీడింగ్, సైన్స్, సోషల్, జనరల్ నాలెడ్జి అంశాలపై క్విజ్, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీలు నిర్వహించామని వివరించారు. కొన్ని పదాల ఆధారంగా విద్యార్థులు స్టోరీని సొంత వాక్యాలలో తయారుచేశారని అన్నారు. అనంతరం మంచికలపూడి గ్రామంలో ర్యాలీ నిర్వహించామని, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించామని వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, క్విజ్‌లలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొండమెట్లబజారు నుంచి గాంధీ బొమ్మ వైపు వెళ్లే దారిలో కాలువపై ఏర్పాటు చేసిన సిమెంటు పైపు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. పగిలిన పైపుపై పెద్ద గుంత ఏర్పడటంతో దానిపై స్థానికులు తాత్కాలికంగా నడిచేందుకు వీలుగా బండరాయిని పెట్టారు. నిత్యం ఈదారి మీదుగా పలు వాహనాలు వెళుతుండటంతో బండరాయి పూర్తిగా పగిలిపోయింది. రాత్రి సమయాల్లో వాహనాలు బండకు తగిలి కిందపడి గాయాలపాలవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువపై పైపును ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు

దరిచేరిన పింఛను



గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న రమ్యకృష్ణ

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలిలో శుక్రవారం కొనసాగింది. వృద్ధాప్య, వింతతువు, వికలాంగు పింఛన్లతో పాటు హెల్త్ పింఛన్లను సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, వలంటీర్లు పంపిణీ చేశారు. ఐతా నగర్‌కు చెందిన యంగ్రపాటి స్వాతి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఇంటిలోనే ఉంటోంది. ఆమెకు వెల్ఫేర్ ఆనందరావు, వలంటీర్ మంద్రు మౌనిక హెల్త్ పింఛన్ రూ.5 వేలు అందజేశారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులో నివసించే తాడివాక విజయలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. డయాలసిస్ రోగులకు అందించే రూ.10వేల పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ సీహెచ్.రమ్యకృష్ణ గుంటూరు వెళ్లి అందజేశారు. అలాగే ఐతానగర్‌కు చెందిన పాముల సౌభాగ్యంకు వలంటీర్ పిల్లి నరసింహారావు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ దేవిక వాణి, సిబ్బంది

తెనాలిఅర్బన్: ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని మారీసు పేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వాకాడ దేవికవాణి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా మారీసుపేటలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియ ఒకరి నుంచి మరొకరికే సోకే అవకాశం ఉందన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే సమీపంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది డి.మల్లేశ్వరరావు, తిరువీధుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ, ప్రియాంక

మున్నంగి(కొల్లిపర): ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ, నిత్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం వల్ల దోమలు, ఈగలు అభివృద్ధి చెందకుండా అరికట్టవచ్చు అని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. శుక్రవారం డ్రైడేలో భాంగంగా మున్నంగి గ్రామంలో నీటి నిల్వలను పరిశీలించి, దోమల నిర్మూలనకు ఎబేట్ మందును మురుగు నీటిలో సిబ్బంది చేత పిచికారి చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు నీరు నిల్వలు ఉండటం వలన దోమల లార్వాలు అభివృద్ధి చెంది దోమలు అధికమవుతాయిఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి , సమాజ ఆరోగ్య అధికారిణి దాసర స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, తమ్మ నాగరాజు, వైద్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన అతిథులు

తెనాలి: తెనాలిలో షేక్ ఖాశింబీ మెమోరియల్ జిల్లాస్థాయి అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజి క్రీడా మైదానంలో ప్రారంభమైంది. షేక్ మాలిక్ ఆధ్వర్యంలో ది ఏషియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటులో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ కొత్త రవికిరణ్, ది అమరావతి కో-ఆపరేటివ్ బ్యాంక్ జిల్లా సీఈవో తన్నీరు శ్రీనివాసరావు, చైతన్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ నన్నపేని సునీల్‌కుమార్, యువ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ బండారు రవికాంత్, బండారు మధుసూదన్, షేక్ బాఖర్ హాజరయ్యారు. తొలుత షేక్ ఖాశింబీ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులు షేక్ రిజ్వాన-సాదిక్ బాషా, షేక్ బీబీ-రెహ్మాన్, షేక్ కమర్‌జహా-రాజిక్, షేక్ మానస, మీరాబీ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని సుగాలీ కాలనీ, ఎస్సీ కాలనీ, చెన్నకేశవ నగర్ వాసులు పడుతున్న ఇబ్బందులకు తెరపడింది. శుక్రవారం ఈ మూడు ప్రాంతాలకు అనువుగా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమ య్యాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రజలు పడుతున్న కష్టాలను గమనించి, చొరవ తీసుకుని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ వారితో మాట్లాడి ఫుట్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జి కారణంగా సుగాలీ కాలనీ, ఎస్సీ కాలనీ, చెన్నకేశవనగర్ ప్రాంత ప్రజలకు సుమారు కిలోమీటర్ మేర చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తప్పుతుంది. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమైనందుకు దుగ్గిరాల వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.